క్లుప్తంగా...

హమ్మయ్య
రాకపోకలు షురూ!

శేరిలింగంపల్లి: లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి నుంచి వాహనాల రాకపోకలు మళ్లీ ఆరంభమయ్యాయి. ఆదివారం రోజు వాహనాల రాకపోకలకు అనుమతించాలని అధికారులు నిర్ణయించడంతో వాహనాలు రాకపోకలు సాగించారు. శేరిలింగంపల్లిలో కురుస్తున్న వర్షాలతో లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి నుంచి రాకపోకలు వారం రోజుల పాటు నిలిచిపోయిన విషయం తెలిసిందే. ఈ ప్రాంతం గుండా రాకపోకల నిలిపివేతతో ఈ ప్రాంత ప్రజలు, ఈ మార్గంలో రాకపోకలు సాగించే ఉద్యోగులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. బ్రిడ్జి కింది పేరుకుపోయిన బురద, ఇసుక మేటలను జీహెచ్‌ఎంసీ అధికారులు తొలగించేందుకు చర్యలు చేపట్టారు.

హబీబ్‌నగర్
ఇన్‌స్పెక్టర్‌గా రాంబాబు

నాంపల్లి: హబీబ్‌నగర్ ఇన్‌స్పెక్టర్‌గా టి.రాంబాబు బాధ్యతలు స్వీకరించారు. మీర్‌చౌక్ పోలీస్ స్టేషన్‌లో డీఐగా విధులు నిర్వర్తించిన రాంబాబు ఆదివారం జరిగిన సాధారణ బదిలీల్లో హబీబ్‌నగర్‌కు వచ్చారు. హబీబ్‌నగర్ సీఐగా పనిచేసిన సైదబాబు శ్రీరామ్ టాస్క్‌ఫోర్స్‌కు బదిలీ అయ్యారు.

నాంపల్లి ఇన్‌స్పెక్టర్‌గా అభిషేక్..
నాంపల్లి శాంతిభద్రతల ఇన్‌స్పెక్టర్‌గా అభిషేక్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. మధ్య మండలంలోని అబిడ్స్ పోలీస్‌స్టేషన్‌లో డీఐగా పని చేస్తూ నాంపల్లికి బదిలీపై వచ్చారు. నాంపల్లి ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన రాజు నాయక్ బానోతు మధ్య మండలం టాస్క్‌ఫోర్స్‌కు బదిలీపై వెళ్లారు.

వైద్య వృత్తి
ఎంతో పవిత్రమైంది

గన్‌ఫౌండ్రీ: వైద్య వృత్తి ఎంతో పవిత్రమైందని తెలంగాణ రాష్ట్ర శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ అన్నారు. ఆదివారం రవీంద్రభారతిలో మదర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని పలువురికి వైద్య రత్న అవార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సరస్వతి ఉపాసకులు దైవాజ్ఞశర్మ, సీనియర్ న్యాయవాది లయన్ డాక్టర్ ఏవీ. స్వామి, వైద్య నిపుణులు డాక్టర్ ఆశీష్ చౌహాన్, విశ్రాంత డీసీపీ బద్రినాథ్, సంస్థ వ్యవస్థాపకులు మల్లికార్జున్‌రావు, రాఘవ తదితరులు పాల్గొన్నారు.

అనిరుధ్ ఆచార్య
మహారాజ్‌కు స్వాగతం

అబిడ్స్: ఆధ్యాత్మిక గురువు అనిరుధ్ ఆచార్య మహారాజ్‌కు ఘన స్వాగతం పలికారు. జ్ఞాన్ బాగ్ కాలనీలో గోల్కొండ జిల్లా బీజేపీ కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి ముక్క కృష్ణాగుప్తాతో పాటు పలువురు నాయకులు ఆయనకు స్వాగతం పలికి ఆశీర్వాదాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ముక్క కృష్ణాగుప్తా మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక భావాలతో మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు.

కరపత్రం ఆవిష్కరణ

విజయనగర్‌కాలనీ: ఆసిఫ్‌నగర్ దాయిబాగ్‌లోని హనుమాన్ బాలాజీ మందిరం 15వ వార్షిక బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నట్లు ట్రస్టు అధ్యక్షుడు సత్యంచారి, బ్రహ్మోత్సవ కమిటీ అధ్యక్షుడు గౌరిగె శ్రీనివాస్ తెలిపారు. ఈ మేర కు ఆలయ ప్రాంగణంలో ఆదివారం బ్రహ్మోత్సవ ఆ హ్వాన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరంలాగే ఈ ఏడాది కూడా బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు పేర్కొన్నా రు. ట్రస్టు ప్రధాన కార్యదర్శి రమేష్‌కుమార్, సహాయ కార్యదర్శి దాస శ్రీనివాస్, కోశాధికారి సామల శ్రీనివాస్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

‘బస్తీబాట’లో
ప్రజా సమస్యల పరిష్కారం

అబిడ్స్: బస్తీబాట ద్వారా ప్రజా సమస్యలు వేగంగా పరిష్కారం అవుతాయని గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ నాయకుడు ఆశీష్‌కుమార్‌యాదవ్ పేర్కొన్నారు. బేగంబజార్ డివిజన్‌లోని మొగరం బస్తీ, మహారాజ్ గంజ్ బస్తీల్లో బస్తీబాట కార్యక్రమం నిర్వహించి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆశీష్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ.. ప్రజలు ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే జీహెచ్‌ఎంసీ, వాటర్ బోర్డు, విద్యుత్, ఇతర శాఖల అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంతోష్, వెంకటేష్, గణేష్, శ్రీనివాస్, వేణు, నరేష్, శివుడు, ప్రశాంత్, అరవింద్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న బీఆర్‌ఎస్ నాయకుడు ఆశీష్‌కుమార్‌యాదవ్

బీఆర్‌ఎస్‌తోనే అన్ని వర్గాలకు లబ్ధి



నార్సింగి బేడ, బుడగ జంగం సభ్యులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

మణికొండ: రాష్ట్రంలోని అన్ని కులాలు, మతాల వారికి బీఆర్‌ఎస్ పార్టీ సమ ప్రాధాన్యం ఇస్తుందని, బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో అన్ని కులాల వారు లబ్ధి పొందుతున్నారని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ పేర్కొన్నారు. నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలోని బేడ, బుడగ జంగం సభ్యులు 100 మంది మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకటేష్‌యాదవ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బుడగ జంగం సంఘానికి నార్సింగిలో కమ్యూనిటీహాల్ నిర్మాణానికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని పథకాలలో లబ్ధిపొందేలా తన వంతు సహకారం అందిస్తామన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ డి.రేఖాయాదగిరి, మాజీ ఎంపీపీ తలారి మల్లేష్, బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు ఆర్. నర్సింహ, కౌన్సిలర్ పత్తి ప్రవీణ్‌కుమార్, కో-ఆప్షన్ సభ్యుడు మహబూబ్, నాయకులు జితేందర్ తదితరులు పాల్గొన్నారు.

గేటెడ్ కమ్యూనిటీల సమస్యలు పరిష్కరిస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ రంజిత్‌రెడ్డి

మణికొండ: అత్యధిక జనాభా నివసించే గేటెడ్ కమ్యూనిటీల సమస్యలు వేరుగా ఉంటాయని, వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని చేవెళ్ల ఎంపీ డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని మై హోం అవతార్ గేటెడ్ కమ్యూనిటీ సభ్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు రోడ్లు, వీధి దీపాలు, తాగునీరు, ట్రాఫిక్ సమస్యలు, పార్కుల అభివృద్ధి, చెరువు, హనుమాన్ దేవాలయాభివృద్ధి చేయాల్సిన అవసరాలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తన దృష్టికి వచ్చే ప్రతి సమస్యను పరిష్కరించేందుకు పూర్తి స్థాయిలో కృషి చేస్తానన్నారు. స్థానికులు తన దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను అక్కడే ఉన్న విద్యుత్, జలమండలి, మున్సిపల్ అధికారులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ డి.రేఖాయాదగిరి, వైస్‌చైర్మన్ వెంకటేష్‌యాదవ్, మణికొండ మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ ఫ్లోర్ లీడర్ కె.రామకృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ తలారి మల్లేష్, మైహోం అవతార్ నివాసితుల సంక్షేమ సంఘం సభ్యులు, నివాసితులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



13వ డివిజన్‌లో రోడ్డు సమస్యలను పరిశీలిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: ప్రజలు సీజనల్ వ్యాధులు రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర వెల్లడించారు. ఆదివారం కార్పొరేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఆయన అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వర్షాల కారణంగా నీరు నిలిచి దోమల వ్యాప్తి పెరిగి విష జ్వరాలు వచ్చే అవకాశాలు ఉన్నందున అవి రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. నీరు నిలిచే ప్రదేశాల్లో దోమలు వ్యాప్తి చెందకుండా బ్లీచింగ్ చల్లాలని సిబ్బందిని ఆదేశించారు. 13వ డివిజన్ నాయకులు రావులకొల్ల నాగరాజు, వెస్టండ్ కాలనీ రోడ్డు నెంబర్ 4లో డ్రైనేజీ సమస్య, ఫార్మాయిషి హోటల్ రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారిందన్నారు. ప్యాచ్‌వర్క్‌ను నిర్వహించాలని కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. సానుకూలంగా స్పందించిన ఆయన సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్, శానిటరీ జవాన్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హోం గార్డులను
పర్మినెంట్ చేయాలి

గచ్చిబౌలి: హోం గార్డులను పర్మినెంట్ చేయాలని సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లాలని మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావుకు తెలంగాణ హోం గార్డ్స్ అసోసియేషన్ ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. సీఎం కేసీఆర్ హోంగార్డులను పర్మినెంట్ చేస్తామని ప్రకటించారని మంత్రికి వివరించారు.

అక్రమ కమేళాపై
పోలీసుల దాడులు

చాంద్రాయణగుట్ట: అక్రమ కమేళాపై ఫలక్‌నుమా పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించారు. వివరాల ప్రకారం.. ముస్తఫానగర్‌లో ఖదీర్(54), కరీం(30) కొన్ని రోజులుగా జంతు కమేళాను నిర్వహిస్తున్నారు. ఇతర జంతువుల ముసుగులో గుట్టుగా గోవులను వధిస్తున్నారు. దీనిపై సమాచారం అందుకున్న ఫలక్‌నుమా పోలీసులు దాడులు నిర్వహించి ఆరు గోవులను స్వాధీనం చేసుకున్నారు. నిర్వాహకులను అరెస్ట్ చేశారు.

బీజేపీతోనే రాష్ట్రాభివృద్ధి



ఈటల రాజేందర్‌ను సన్మానిస్తున్న తోకల శ్రీనివాస్‌రెడ్డి

రాజేంద్రనగర్: బీజేపీతోనే తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. నాగోల్ శుభం కన్వెన్షన్‌లో జరిగిన కార్యక్రమానికి మైలార్‌దేవ్‌పల్లి నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివెళ్లారు. ఈ సందర్భంగా బీసీ నాయకులతో కలిసి ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన ఈటల రాజేందర్‌కు ఆత్మీయ సత్కారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్‌గా నియమితులైన ఈటల రాజేందర్‌ను కలిసి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశామన్నారు. భవిష్యత్తులో ఆయన మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. డివిజన్ బీజేపీ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



హైదర్‌గూడలో మిఠాయిలు తినిపించుకుంటున్న నేతలు

పార్టీ మరింత బలోపేతం..

అత్తాపూర్: కేంద్ర బీజేపీ ప్రధాన కార్యదర్శిగా బండి సంజయ్ నియమితులు కావడం హర్షనీయమని చేవెళ్ల పార్లమెంట్ బీజేపీ కన్వీనర్ నారగూడెం మల్లారెడ్డి అన్నారు. బండి సంజయ్ నియామకం సందర్భంగా ఆదివారం హైదర్‌గూడలో సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు మిఠాయిలు తినిపించుకుంటూ ప్రజలకు పంచిపెట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీజేపీలో కష్టపడి పనిచేసే వారికి కేంద్ర ప్రభుత్వం తప్పకుండా గుర్తిస్తుందన్నారు. రాష్ట్రంలో బీజేపీ మరింత బలోపేతం కానుందని ఆశాభావం వ్యక్తం చేశారు. బీజేపీ అత్తాపూర్ డివిజన్ అధ్యక్షుడు సాబాద విజయ్‌కుమార్, స్వప్న, డివిజన్ బీజేపీ ప్రధానకార్యదర్శి సాయియాదవ్, కాకుళారం కృష్ణ, మ్యాడం రాము, శ్రీరామ్ తదితరులున్నారు.

ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి



మాట్లాడుతున్న డాక్టర్ గురు ఎన్‌రెడ్డి

రాయదుర్గం: ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని కాంటినెంటల్ ఆస్పత్రి చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గురు ఎన్‌రెడ్డి సూచించారు. నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలోని కాంటినెంటల్ ఆస్పత్రిలోని కాంటినెంటల్ కేన్సర్ సెంటర్ ఆధ్వర్యంలో ‘గిస్ట్ ఆఫ్ గిస్ట్’ అనే పేరిట జీర్ణాశయంలోని స్ట్రోమల్ కణితులపై ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్యాస్ట్రో ఇంటెస్టినల్ స్ట్రోమల్ ట్యూమర్స్ అరుదుగా వస్తున్నాయని, వీటికి చికిత్స చేయగలిగే పరిస్థితులున్నాయని ఎలాంటి అపోహలకు గురికావాల్సిన అవసరం లేదన్నారు. ఎలాంటి రోగాలైనా తగ్గించే వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయని, ఎవరూ అధైర్య పడొద్దన్నారు. ప్రతి ఒక్కరూ వాకింగ్, సైక్లింగ్‌తో పాటు యోగా, ధ్యానం వంటి కూడా దృష్టి సారించాలన్నారు. ఈ సదస్సులో డాక్టర్ జగన్నాథ్, డాక్టర్ ఏవీఎస్ సురేష్ పాల్గొన్నారు.

సాహిత్యం సమాజ అభ్యున్నతికి దోహదం

గన్‌ఫౌండ్రీ: సాహిత్యం సమాజాన్ని అనేక కోణాలలో ప్రతిబింబింపజేస్తుందని కేంద్ర సాహిత్య అకాడమి పురస్కార గ్రహీత, ప్రముఖ రచయిత అంపశయ నవీన్ అన్నారు. ఆదివారం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో తెలుగు సాహితీవనం 6వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రచయితలు రచించిన పలు పుస్తకాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సాహిత్యం సమాజ అభ్యున్నతికి దోహదపడుతుందన్నారు. ఈ సందర్భంగా రచయితలు డాక్టర్ పి.విజయలక్ష్మి పండీట్, ప్రసాదరావుకు జీవన సాఫల్య పురస్కారం, కల్లూరి రాజుకి యువకవి పురస్కారం, రావుల దయాకర్, వెంకటేష్, చాగంటి సత్యకు ఉగాది పురస్కారాలను ప్రదానం చేశారు. మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి, రచయిత్రి ఓల్గా, పెద్దింటి అశోక్‌కుమార్, సత్యాజి తదితరులు పాల్గొన్నారు.

భారతీయ కళా సంస్కృతిని కాపాడుకుందాం

గన్‌ఫౌండ్రీ: 300 మంది విద్యార్థుల భరతనాట్య వీణావాయిద్య కచేరి ఆహుతులను ఆకట్టుకుంది. ఆదివారం కింగ్‌కోఠిలోని భారతీయ విద్యాభవన్‌లో సరస్వతి సంగీత నృత్య శిక్షణాలయం 21వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిలుకూరు బాలాజీ దేవస్థానం ప్రధాన అర్చకులు రంగరాజన్ మాట్లాడుతూ.. భారతీయ కళా సంస్కృతిని యువతరానికి నేర్పించే మహోన్నత కార్యక్రమాన్ని తీసుకోవడం ఎంతో అభినందనీయమన్నారు. అనంతరం కళాకారుల సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు అలరించాయి. అంతకు ముందు ప్రముఖ నాట్య కళాకారులు జొన్నలగడ్డ ఈశ్వర్‌ప్రసాద్, జొన్నల గడ్డ సిధ్రువ లక్ష్మి దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సినీనటుడు పీవీఎల్ నర్సింహారావు, సంగీత క్షీరసాగరం వ్యవస్థాపకులు ఆనందమోహన్, నిర్వాహకులు ప్రతిమా శశిధర్ తదితరులు పాల్గొన్నారు.

మోచీ సమాజ్ అభ్యున్నతికి కృషి

జియాగూడ: మోచీ సమాజ్ అభ్యున్నతికి కృషి చేస్తానని సంత్ రవిదాస్ మోచీ సమాజ్ సేవా సంఘం నూతన అధ్యక్షుడు మహేష్కర్ కాంతిలాల్ అన్నారు. ఈ మేరకు ఆదివారం జియాగూడలోని సంజయ్‌నగర్‌లో గల సంత్ రవిదాస్ మోచీ సమాజ్ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నూతన అధ్యక్షుడిగా మహేష్కర్ కాంతిలాల్‌ను ఎన్నుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం మోచీ కులస్థుల సమస్యలను పరిష్కరించాలని చెప్పులు కుట్టే వృత్తితో జీవిస్తున్న మోచీలకు ఉపాధి కరువైందన్నారు. కేసీఆర్ ప్రభుత్వం మోచీ కులస్థులకు దళితబంధును అందించి ఆదుకోవాలన్నారు. సభ్యులు మనోహర్ లాల్ పుర్వే, ఉమేష్ మహేష్కర్, మనోహర్ మాహోరే, వినోద్ దయాల్, ముఖేష్ మహోరే, నర్సింగ్ పర్వారే, గణేష్ దేవీకర్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూలో ‘క్లీనింగ్ డ్రైవ్’



సేకరించిన వ్యర్థాలు, చెత్తాచెదారం బ్యాగులతో ఏబీవీపీ నాయకులు

రాయదుర్గం: అఖిల భారత విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలోని స్టూడెంట్ ఫర్ డెవలప్‌మెంట్(ఎస్ఎఫ్‌డీ) ఆధ్వర్యంలో ఆదివారం గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో క్లీనింగ్ డ్రైవ్ నిర్వహించారు. క్యాంపస్‌లోని మెన్స్ హాస్టల్ సీ, ఎస్ఆర్ఎస్ పరిసరాలలో వ్యర్థాలను తొలగించారు. ఈ సందర్భంగా హెచ్‌సీయూ ఏబీవీపీ అధ్యక్షుడు అక్షయ్, కార్యక్రమ కన్వీనర్ దర్పా, బిప్లవ్ మాట్లాడుతూ.. హెచ్‌సీయూ క్యాంపస్ క్లీన్ అండ్ గ్రీన్ చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. ప్రతియేటా క్యాంపస్‌లో మొక్కలు నాటడం, క్లీనింగ్ డ్రైవ్ కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ఆకాశ్, ఫణీంద్ర, తులసీరామ్, శ్రావణ్, మహేష్, రాజేంద్ర, ధర్మవీర్, నిశాంత్, పర్ణిక, అనీల్, కైలాస్, దేవేందర్ పాల్గొన్నారు.

దివ్యాంగులకు మజ్లిస్ అండ

గోల్కొండ: మజ్లిస్ పార్టీ దివ్యాంగులకు అండగా ఉంటుందని మజ్లిస్ పార్టీ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. గ్రేటర్ హైదరాబాద్ వికలాంగుల సంక్షేమ సంఘం నాయకులు ఆదివారం ఆయనను కలిశారు. ఈ సందర్భంగా వారు ఆయనకు పుష్పగుచ్ఛం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీ లకు ఇస్తున్న రూ.లక్ష రుణం తమకు కూడా వర్తింపజేయాలని, వికలాంగుల వ్యాపారాన్ని బట్టి రూ.లక్ష పరిమితిని పెంచాలని వారు ఆయనను కోరారు. ఈ సందర్భంగా అసదుద్దీన్ ఒవైసీ మాట్లాడుతూ.. వికలాంగులకు ఇచ్చే రుణ పరిమితిని పెంచడం కోసం తాను అధికారులతో మాట్లాడుతానన్నారు. అంతేకాకుండా వారికి రుణ వాయిదాలు పెంచడంతో పాటు సబ్సిడీ ఇవ్వాలని కూడా కోరతానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జాహెద్ అలీ, సయ్యద్ అఫ్రోజ్, మహ్మద్ యూసుఫ్, గులాం మహమూద్, ఎంఏ జాహెద్, అక్రమ్ అలీ తదితరులున్నారు.

శివసాయినగర్ సమస్యలను పరిష్కరిస్తాం

బండ్లగూడ్ జాగీర్ మేయర్ మహేందర్ గౌడ్



శివసాయినగర్‌కాలనీ సభ్యులతో బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్

సాక్షి, సిటీబ్యూరో: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బైరాగిగూడ శివసాయినగర్ కాలనీలో సమస్యలన్నీ పరిష్కరిస్తామని మేయర్ మహేందర్‌గౌడ్ హామీ ఇచ్చారు. కాలనీలోని మూడో నెంబర్ లైన్‌లో ఇటీవల వేసిన సీసీ రోడ్డు ప్రారంభం సందర్భంగా ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కాలనీ సమస్యలను విడతలవారీగా పరిష్కరిస్తున్నామని.. ఇప్పటికే కొన్నిచోట్ల డ్రైనేజీ పనులు పూర్తి చేశామన్నారు. అలాగే కాలనీలోని మిగిలిన సీసీరోడ్లు కూడా త్వరలోనే వేస్తామని పేర్కొన్నారు. ఒకటో నెంబర్ వార్డు కార్పొరేటర్ తలారి చంద్రశేఖర్, కార్పొరేషన్ డీఈ యాదయ్య, శివసాయి నగర్ కాలనీ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు సుబ్బారావు, అధ్యక్షుడు రమణారెడ్డి, జనరల్ సెక్రటరీ పార్శి వెంకట్, ఇతర కార్యవర్గ సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతికి కృషి

ప్రధాని 103వ మన్‌కీబాత్



పార్టీ కార్యాలయంలో మన్‌కీబాత్‌లో బీజేపీ నేతలు

రాజేంద్రనగర్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో పేద ప్రజల అభ్యున్నతికి ఎనలేని కృషి అందిస్తున్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వై.శ్రీధర్ అన్నారు. రాజేంద్రనగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు బాబురావు ఆధ్వర్యంలో ఆదివారం ప్రధాని 103వ మన్‌కీబాత్ కార్యక్రమాన్ని వీక్షించారు. ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి ఈ.వేణుగోపాల్, జ్ఞానేశ్వర్ తదితరులున్నారు.

అత్తాపూర్: ప్రధాని నరేంద్రమోదీ మన్‌కీబాత్ 103వ ఎపిసోడ్‌ను అత్తాపూర్ డివిజన్ సర్దార్ వల్లభాయ్ పటేల్ శక్తి కేంద్రం బూత్ నెంబర్ 230లో శక్తికేంద్రం సహ ఇన్‌చార్జి నారగూడెం సోమనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో వీక్షించారు. ఈ కార్యక్రమానికి చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ నారగూడెం మల్లారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 103వ మన్‌కీ బాత్ ఎపిసోడ్‌లో ప్రధాని నరేంద్రమోదీ అనేక కీలకమైన విషయాలపై చర్చించారన్నారు. మన దేశ పురాణాలు, సంస్కృతి, సంప్రదాయాలకు సంబంధించిన చిత్రకళల ప్రదర్శన, మహారాష్ట్రలోని ఛత్రపతి శివాజీ, తుల్జాభవానీ ఆశీర్వచనాలతో అందరూ సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారన్నారు. అన్ని రాష్ట్రాల క్రీడాకారులను ప్రోత్సహించేందుకు భారత ప్రభుత్వం ఎన్నో రకాల అవకాశాలను కల్పిస్తోందన్నారు. ఆగస్టు 15 నాటికి దేశంలోని అన్ని రాష్ట్రాల్లో తిరంగా కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అత్తాపూర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు సాబాద విజయ్‌కుమార్, స్వప్న, డివిజన్ ప్రధాన కార్యదర్శి సాయియాదవ్, కృష్ణ, మ్యాడం రాము, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

సంఘం సభ్యుల సహకారంతోనే ఆర్థిక ఉన్నతి



వివరాలు వెల్లడిస్తున్న సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

రాజేంద్రనగర్: చిన్న మొత్తాల పొదుపులతో సహాయ సహకారాల పొదుపు సంఘాలు ఆర్థిక ఉన్నతికి దోహదం చేస్తున్నాయని భవానరుషి పద్మశాలి పొదుపు సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏర్వ సత్యనారాయణ, విజయ్‌కుమార్‌లు అన్నారు. సభ్యుల క్రమశిక్షణ సంఘాభివృద్ధికి బాటలు వేస్తుందని వారు ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఆదివారం పొదుపు సంఘం 10వ వార్షికోత్సవం మార్కండేయ భవన్ ఆవరణలో నిర్వహించారు. గతేడాది సభ్యుల పొదుపులు, అప్పులు, సభ్యుల నుంచి చేసిన వసూళ్లు, ఆదాయం తదితర అంశాలతో కూడిన వార్షిక నివేదికను సభ్యులకు తెలియజేశారు. ఆడిటర్ 2022–23 ఆడిట్‌చేసే విధానం, సంఘం ఆర్థికంగా ముందుకు కొనసాగుతున్న వివరాలను వివరించారు. ప్రస్తుతం 635 మంది సభ్యులతో సుమారు రూ.2కోట్ల టర్నోవర్‌తో సజావుగా కొనసాగుతుందన్నారు. దీనికి ప్రతి నెల సభ్యులు తమతమ పొదుపులు, తీసుకున్న అప్పుల కిస్తులు చెల్లిస్తూ.. సంఘాభివృద్ధికి సహకరిస్తున్నారన్నారు. సలహాదారులు నిరంజన్, యాదగిరి, కోశాధికారి యాదయ్య, పాలకవర్గ సభ్యులు రాజుకుమార్ కోట శ్యామ్‌కుమార్, భిక్షపతి, కొంపల్లి జగదీష్, చిరంజీవి, శ్రీనివాస్, రవీందర్, పద్మాశ్రీనివాస్, అభిక, లావణ్య, రాజు, రాధాకృష్ణ, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

గోల్కొండ: నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. ఆయనను కార్వాన్, గుడిమల్కాపూర్ నుంచి పలువురు వచ్చి ఆదివారం కలిశారు. వారి ప్రాంతాల్లో ఉన్న సమస్యలను ఆయనకు వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. భారీ వర్షాలకు కార్వాన్ నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో రోడ్లు దెబ్బతిన్నాయన్నారు. బల్దియా వారు మాన్‌సూన్ టీంలు రోడ్డు ప్యాచ్‌వర్కులు చేస్తున్నాయన్నారు. డ్రైనేజీల మరమ్మతులకు జలమండలి వారు చురుకుగా పని చేస్తున్నారని ఆయన తెలిపారు. అంటు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటున్నామని ఆయన అన్నారు. పారిశుద్ధ్య పనులు వెంటనే చేయడానికి అదనపు పారిశుద్ధ్య యూనిట్లు ఏర్పాటు చేశామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, నాయకులు బేగ్, జబ్బార్ తదితరులున్నారు.

ప్రజాధనం ‘చెత్త’పాలు





గోల్కొండ: రోడ్ల పక్కన ఏర్పాటు చేసిన డస్ట్ బిన్‌లు చెత్తపాలవుతున్నాయి. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పలు ప్రాంతాల్లో వీటిలో కొన్ని చెత్త కుప్పలో చేరిపోగా, మరికొన్నింటిని ఫుట్‌పాత్ వ్యాపారులు తొలగించి రోడ్ల పక్కన పడేశారు. రోడ్లు, ఫుట్‌పాత్‌లపై చెత్తను వేయకుండా ప్రత్యేకంగా కోట్ల రూపాయలు వెచ్చించి డస్ట్ బిన్‌లను ఏర్పాటు చేశారు. మెహిదీపట్నం, నానల్‌నగర్ చౌరస్తా, మాసబ్‌ట్యాంక్, టోలిచౌకి చౌరస్తా తదితర ప్రాంతాల్లో ఎన్నో చెత్త డబ్బాలు వృథాగా.. కొన్ని గయాబ్ కాగా.. మరికొన్ని రోడ్ల పక్కన పడి ఉన్నాయి. టోలిచౌకిలో భవన నిర్మాణానికి అవసరమయ్యే ఇసుక, ఇటుక, హైడర్లు, కంకర అమ్మేవారు ఫుట్‌పాత్‌లపై ఉన్న డస్ట్‌బిన్‌లను తొలగించారు. డస్ట్ బిన్‌లు ఒక్కొక్కటిగా కనుమరుగవుతున్నా అధికారుల్లో చలనం లేదనే విమర్శలున్నాయి.